


# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 950 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం – సాహిత్యం

## -22-

"పంట కాలవ ప్రవాహం చూసారా? సరిగ్గా అట్లా ఉంటుంది కాల ప్రవాహం. జోరుగా నీళ్ల దూకుడుతో, ఎగురుతూ పరిగెత్తుతూ ఉంటాయా? ఆ పక్కన కొన్ని నీళ్లు, కదలకుండా నిలబడి చూస్తూ ఉంటాయి. ఒక్క అంగ అవతలే కానీ, ఈ హడావుడిలో చేరవు. మనసు ఈ ఈడ్పు లోనుంచి పక్కన వున్న నీళ్ల లోకి వెళ్లగలగాలి. అక్కడ ప్రవాహం లోకి పోయే చేపకి ఆ పని సాధ్యం కాకపోవచ్చు. కానీ, ఈ లోకంలో ఆ ఒక్క జానెడు దూరం దాటడం చేతకాదు. మహా యోగులకు కూడా. "

ఈ అభిప్రాయాలు వ్యక్త పరచింది. శతాబ్దాల సంచలనం–చలం.

శతాబ్దాలు దాటినా జోరుతగ్గని ప్రభంజనం – గుడిపాటి వెంకట చలం.

ఇది చివరి భాగం…

చలం గారి సాహిత్యంలో నాటికలూ, నాటకాలూ కూడా ముఖ్య భాగం అని కూడా తెలుసుకున్నాం. వీటిల్లో ప్రధానంగా పురాణ, ఇతిహాస పాత్రలనూ, వాటి స్వభావాలనూ లేదా వాటికి ఎదురైన సందర్భాలనూ, చలం

గారు తనదైన శైలిలో విశ్లేషించుకుని వాఖ్యానించారు. చాలాసార్లు నిలదీసి ప్రశ్నించారు. నిగ్గదీసి అడిగారు. తన దృష్టిలో చూసిన కోణాలపై సెర్చ్ లైట్ ప్రసరించారు.

అలాంటి ఆయన వ్రాసిన ఓ నాటిక లేదా చిన్న రూపకం –"సీత అగ్ని ప్రవేశం" దీన్ని ఇద్దరు వ్యక్తుల మధ్య సంభాషణ అనుకోవచ్చు.వాళ్లిద్దరూ – రామాయణం లోని రాముడూ, సీతా. ఇది ఎలా మొదలవుతుందంటే – రావణ సంహారం జరిగాక, రావణ కాష్టం కాలుతూ వుంది. సీత చాలా రోజుల తర్వాత రాముడ్ని చూసింది. ఆ ప్రేమ తో రాముడితో అంది.

"మన జన్మలో ఇన్ని దినాలూ, మన ప్రేమ వల్ల నశించాయేమోనని దిగులు పడ్డాను. నీకోసం నాహృదయం ఎట్లా అర్పితమైనదో, ప్రలోభమూ కాని, హృదయాన్ని చలింపజేయలేదని, నీ గాఢ అనురాగం కాల పరిమిత వల్ల సంకుచిత పడదని నిరూపించింది ఈ మహా యుద్ధం. చాలా రోజులైంది రామా! నిన్ని చూసి. దగ్గరకు రా! ".

"ఆగు సీతా! నే చెప్పే మాటలు శ్రద్దగా విను. విధి వశం చేత నీవు స్త్రీవి. శత్రువులచేత హరింపబడ్డావు. ఇన్ని సంవత్సరములు అతని ఏకాంత హార్మ్యాలలో… " అని అంటున్న రాముడి మాటలు వినేసరికి, ఒక్క సారి ఎదురు చూడని, ఎదురు దెబ్బలాగా అనిపించింది. 'ఏమిటి? ఏకాంత హార్మ్యాలలో అంటున్నాడు రాముడు. తను ఏకాంత హార్మ్యాలలో ఎక్కడుంది?' అందుకనే సీత అంది " కాదు వనంలో "

"ఏదో ఒకటి. నీవు అస్పృశ్యవు. కళంకితవు. భారత వంశ పారావర చంద్రుడను. ఇల వంశ చూడామణిని. సామ్రాజ్య దురంధురుడైన నాకు పట్ట మహిషివి కాజాలవు. " అంటున్న రాముడి నోటి నుండి అలాంటి మాటలు ఎప్పుడూ ఎదురు చూడలేదు.

"స్పష్టంగా మాట్లాడండి. అస్పృశ్యవు అంటే, మీ అభిప్రాయం ఏమిటి?"

"రావణుడు నిన్ను ప్రేమించాడు "

"నా తప్పా. అతడు ప్రేమించినంత మాత్రానా "

" నిన్ను తస్కరించాడు "

"అది నా తప్పా?"

"అతని అంతఃపుర ఉద్యానవనంలో నువ్వున్నావు."

" అదీ నా తప్పేనా?"

"నీ దురదృష్టం "

"వివాహంలో నాతో సుఖ దుఃఖాలు పంచుకుంటాననీ, ఎప్పుడూ విచార పెట్టననీ, నా భారం వహిస్తాననీ, అర్ధాంగిగా స్వీకరించావు. శత్రువుల నుండి రక్షించుకోవాల్సిన బాధ్యత నీది, ఏ పురుషుడు గానీ, నన్ను ప్రేమిస్తే, నన్ను తస్కరిస్తే, మన బాంధవ్యం విచ్చితమవుతుందా? భార్యాభర్తల సంసార బంధం శాశ్వతం అంటారే? నేనేమైన భక్ష్యాన్నా ఇతరులు ఎంగిలి చేశారనే అనుమానంతో విసిరి కాకులకు పారెయ్యడానికి. నేను జనకుని ప్రియ పుత్రికను. అయోనిజను. నేను సర్వ భూచక్ర శ్రీరాముని పట్టమహిషిను కావడం చేత కదూ! ఎంగిలినైపోయిన విస్తరిని అయిపోయాను. "

రాముడేమి మాట్లాడలేదు. సీతను పరిత్యజించిన శ్రీరాముడు ఇంత ఘోరంగా యుద్ధం చేసిందెందుకు? రాముడేదో సమాధానం చెప్పాడు. చివరికి రాముడేమంటాడంటే…

"ఇది ప్రజలయొక్క అభిప్రాయం. ప్రజాభిప్రాయం ప్రకారం నువ్వు ఇన్ని రోజులు బయట వున్నావు కాబట్టీ, అగ్ని ప్రవేశం చేస్తే తప్ప స్వీకరించలేను."

"శ్రీరామా! ప్రజా అభిప్రాయం పైన అంత గౌరవమా నీకు? నీ తండ్రి నిన్ను అడవులకు పంపిస్తే, వద్దని ప్రజలందరూ కోరిన కోరికను మన్నించావా? అంత కన్నా పితృవాక్య పరిపాలనే ముఖ్యమన్నావు. ఇప్పుడు ఆ ప్రజలు నోరు ముందే, భార్యను పరిత్యజిస్తున్నావు. తండ్రి ఆజ్ఞ అంత అమోఘం. నీచమైన స్త్రీ గనుకనే కదా! ఒక్క మాటలో దిక్కు లేకపోయిన కుక్క గనుకనే కదూ! వాగ్దత్వాలూ, ప్రేమా, ధర్మమూ, వివాహ సంస్కారమూ అన్నీ అంత సులభంగా అతిక్రమించగలుగుతున్నావు. ఈ త్యాగం వలన నా జీవితం అంత ధ్వంసం అయిపోతే, ఇన్ని సంవత్సరాలూ నీకోసం బాధపడి కలలుకంటున్న నా హృదయం బాధలై నశించి పోతే నీకేమిటి?"

ఇలా తన మనసులోని బాధనంతటినీ వ్యక్తం చేసి, రాముడికి తన బాధనూ, తన మనసులో ఉన్న భావాల్ని చెప్పడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో శ్రీరాముడు మాత్రం, సీత చెప్పిన వాదనకు అంగీకరించక… "అగ్ని ప్రవేశం చేస్తే తప్ప, సీతను తీసుకువెళ్లను. అది నా ధర్మం. "అన్నాడు. దానికి సీత ఏమంటోందంటే.. "ఇట్లా త్రుణీకరించి తనని పొమ్మనినా కుక్కనై నీ వెంటనంటి, పాదాలపైన పడి ఏడ్చి, చెయ్యని తప్పుకీ, ప్రాయశ్చిత్తాలకీ లోనై సమస్తమైన న్యూనతలకీ తలవంచితే, యుగయుగాల పతివ్రతను అని నన్ను స్తుతిస్తారు. కొంచెం అభిమానం కలదాన్నయి, ఈ నీచత్వానికి తిరగబడి, నీ కాఠిన్యాన్ని దూషించి, నా జీవితం నేను చూసుకున్నానా?కులట నవుతాను. పోనీ, నిజంగా నీకే నాపై ప్రేమ ఉంటే, ఇది విను! నీకింకా పట్టాభిషేకం కాలేదు. నీ కప్పుడే ప్రజల బాధ్యత ఎక్కడిది?"

"రాజుగా పట్టాభిషేకం అవుతుంది. అయ్యాక అయినా సరే! నా బాధ్యత అది."

"నిజంగా నామీద ప్రేమ ఉంటే, రాజ్యాన్ని వదిలేసి, నాకోసం రావచ్చు కదా!"

"స్త్రీ కోసం, స్త్రీ వ్యామోహంలో చిక్కి, రాజ్యం వదులుకున్నాడు అనే అపవాదు వస్తుంది నాకు "

"భార్య కోసం చలించడం, స్త్రీ వ్యామోహంలో చిక్కుకోవడమా? నేను, నీ మోహంలో చిక్కి, నేను రావణుడి పట్టమహిషి పదవి త్యజించడం నా ధర్మమా?నా ఖర్మమా? స్వార్ధ పరుడా, నీ రాజ్యమూ, నీ కీర్తీ, నీ సంపదా అన్ని స్థిరంగా ప్రవృత్తి పొందాలా? దిక్కులేక మాలిననై, నశింపవలసిన దానిని నేనా? ఇందుకా ఈ తీర్చావు ఇక్కడ. ప్రజాసేవా తత్పరుడివి. నీకు భార్య ఎందుకు?"

"వంశాన్ని నిలపడానికి. నీవు నా పవిత్ర వంశాన్ని అభివృద్ధి చెయ్యడానికి తగవు. "

"అంటే, నేనొక యంత్రాన్ని. బిడ్డల్ని కని నీకు ఇచ్చేందుకు. ఇది మలినమైంది అని తోచింది. ఇంకో కొత్త యంత్రాన్ని తెచ్చుకుంటావు. అంటే, స్త్రీకి ప్రాణం లేదు. హృదయం లేదు. ధర్మం లేదు. నీకు తండ్రి పట్లా,తల్లి పట్లా, తమ్ముల పట్లా ధర్మాలూ, విధులూ వున్నాయి గానీ, భార్య పట్ల లేవు. వున్నా, అవి ఒక్క మాటలో మాయం అయిపోతాయి. ఇవన్నీ ఎందుకు ఒక్కసారి నీ హృదయం ఏమంటోంది?" అంది సీత. దానికి రాముడన్నాడు.

" నా హృదయం తో ప్రసక్తి లేదు. "

అప్పుడు సీత ఒక సుదీర్ఘమైన సంభాషణ చెబుతుంది. అది ఈ నాటికకు ముగింపు. ఏమంటుందంటే...

"హృదయంతో సంబంధం లేదంటున్నావు కదా! రామా! నేనే చెబుతాను విను. రావణుడు నన్ను ప్రేమించాడు. కానీ, రావణుడి ప్రేమ బంధాన్ని, నీ నిశితశరాలు కూడా నాశనం చెయ్యలేకపోయాయి. ఒక నరుడు ఏ మూలనన్నా సంశయిస్తాడేమోనన్న అనుమానం రాగానే నీ ప్రేమ పటాపంచలయ్యింది. నీ ప్రేమా, సర్వజనులూ, భార్యలూ, మునులూ, దేవతలూ అక్రమం అంటున్నాగానీ, రాజ్యమూ, ఐశ్వర్యమూ, ముద్దుల కొడుకూ, తమ్ములూ చస్తున్నా తన పది తలలూ తెగి పడుతున్నా ఈషణ్మాత్రం చలించనిది అతని ప్రేమ. ప్రేమించాడు. నీకర్ధం కాదా ప్రేమ. కనుక దానిని పశుత్వమనీ, రాక్షసత్వమనీ పేరు పెట్టి దానిని సమూలంగా నాశనం చేశావు.

నేనతన్ని ప్రేమించానా? అదేనా నీ అనుమానం? నేనే ప్రేమిస్తే, ముందుగా నా శరీరాన్ని, నీ బాణాలకీ, అతని కవచాలకీ మధ్య కవచంగా అర్పించి వుండనా? పోనీ బలాత్కరించాడా? రావణుడంత నీచుడు కాడు. నా ప్రేమ కోరాడు. కానీ, తన సంతానం వృద్ధి చేసే యంత్రంగా చూడలేదు. నన్ను తన వంక చూడకపోయినా, తనని వ్యతిరేకించినా తనని ప్రేమిస్తాననే ఆశ ఏమాత్రం లేకపోయినా, నా సన్నిధినే కోరి, నేనే లేని జీవితం వ్యర్ధం అని తన సర్వస్వం ఆహుతి చేశాడు. అటువంటి ధీరుడ్ని ప్రేమించక, కఠినత్వం వహించిన పాపం, ఇదిగో నాకిట్లా తగుల్తోంది.

రెండోది, బలాత్కరించాడే అనుకో, ఆ రాక్షసుడి బలాత్కారం వలన, న్యూనత పొందిన సుకుమార హృదయానికి పరిశాంతిని ఇవ్వవలసిన వాడివి. ఇదా నువ్వు చూపే కరుణ!? నీవు ధర్మాన్ని నడిపే యంత్రం. నేను పిల్లల్ని కనే యంత్రం. నీవు నన్ను తృజించడం కాదు. నీవంటి హృదయం లేని యంత్రాన్ని, వంచకుడ్ని, ప్రమాణాన్ని భగ్నం చేసే నీచుడ్ని, నిన్ను నేనే భర్తగా తృజిస్తున్నాను. నీ నీచ నామంతో అపవిత్రమైన నా హృదయాన్ని ఈ ప్రణయ ధీరుడి రుధిరం వల్ల పవిత్రమైన జ్వాలవల్ల నిర్మలం చేసుకొంటాను. "

ఇక్కడ చలం గారు చదువుతున్న పాఠకులకూ, వింటున్న శ్రోతలకూ, చూస్తున్న ప్రేక్షకులకూ వెయ్యి వోల్టుల షాక్ ని ఇస్తారు. అప్పుడు సీత ఏం చేస్తుందంటే… అగ్ని లో దూకుతుంది. శ్రీరాముడు చేయమన్న అగ్నిలోకి కాదు ఆమె దూకింది. రావణుడి చితిలోకి దూకింది. ఇలాంటి ఎదురు చూడని ముగింపులు చలం కొత్త ఏమీ కాదు. అప్పుడు చితిలోకి దూకాక కూడా సీత అంటుంది.

"నా హృదయం పవిత్రమైన నా శరీరం, మలినమైందనే సంశయంతో నన్ను తృజించావు. నా శరీరం నీ వలన మలినమైందని తెలిసి కూడా నా హృదయాన్ని మాత్రమే కోరాడు ఈ రాక్షసుడు. ఎవరిది ఉన్నతమైన ప్రేమో నిర్ణయించగల బుద్ధిమంతులు పుట్టకపోతారా ఈ ప్రపంచంలో. ఎంతకాలం పురుషుడికి, స్త్రీ అణిగి ఉంటుంది. ఏనాటికైనా కళ్ళు తెరవదా ప్రపంచం. "

ఇదీ చలం గారి"సీత అగ్ని ప్రవేశం". చలం గారు స్త్రీల గురించి, పిల్లల గురించి ఎప్పుడైనా సరే , వాళ్ళతరుపున వాదించడానికి ఏ చిన్న అవకాశం దొరికినా వదులుకోరు అనుకోవడానికి ఒక చిన్న ఉదాహరణ ఈ "సీత అగ్ని ప్రవేశం " .

★★★

తరువాత చలంగారు తన 65 సంవత్సరాల వయసులో ప్రారంభించిన అనువాద ప్రక్రియ గురించి తెలుసుకుందాం. ఆ దిశలో ఆయన అనువదించిన "గీతాంజలి" "క్రీస్తు సువార్తలు" విభిన్న గ్రంథాలు ముందుగా చలం గారు 1957 లో ప్రారంభించిన, అనువదించిన 'గీతాంజలి' గురించి…

చలం గారు 1921లో రచనలు చెయ్యడం ప్రారంభించాక 36 సంవత్సరాల పాటు స్వంత రచనలే తప్ప, అనువాదాల గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. అలాంటిది ఈ రవీంద్ర నాథ్ ఠాగూర్ "గీతాంజలి" అనువాదం చేసిన సందర్భం గురించి తెలుసుకోవడానికి ముందు చలం గారికి రవీంద్ర నాథ్ ఠాగూర్ పట్లా, ఆయన రచనల పట్లా ఆసక్తి మొదలయ్యిందో తెలుసుకుందాం.

చలంగారు కాకినాడలో  చదువుకోవడానికి  వెళ్ళిన కొత్తలో బ్రహ్మ సమాజం పరిచయం అయిందని తెలుసుకున్నాం కదా! ఆ రోజుల్లోనే ఠాగూర్ గారి 'గీతాంజలి' గురించి తెలిసింది. ఆ సందర్భం ఆయన ఆత్మకథ లో ఇలా రాసుకున్నారు.

"ఠాగూర్ గారి గీతాంజలి నా జీవితంలోకి వచ్చింది. ఆనాటి నుంచి ఈనాటి వరకూ ఠాగూర్ గారి భక్తి గీతాలు నా జీవితపు లోతుల్ని 'ఇన్ ఫ్లుయెన్స్ ' చేస్తూనే వున్నాయి. ఆయన గానం చేసి గీతాంజలి నా దగ్గరగా వచ్చి నా ప్రక్కనే కూర్చున్నట్లుండేది. ఈశ్వరుడు వచ్చి, నా జీవితంలో ప్రవేశించి అంతరాంతర భావాలతో కలిపి, పెనవేసుకున్నట్లు అనుకునేవాడిని."

అప్పటి నుంచి  చలంగారికి రవీంద్రనాథ్ ఠాగూర్ అంటే, ప్రేమా, భక్తీ, గౌరవం. ఆయన "సుధ" అనే కవితా ఖండికల్లో రాసినప్పుడు రవీంద్రనాథ్ ఠాగూర్ గారిని, జీసస్, గౌతమ బుద్ధుడూ, మహాత్మా గాంధీ స్థాయిలో గౌరవిస్తుండేవారు. ఆ రవీంద్రనాథ్ ఠాగూర్ మీద గౌరవం తోనే, వాళ్ళ పెద్దబ్బాయికి "రవి"అని పేరు పెట్టుకున్నారు. 1950 లో ఆయన అరుణాచలం వెళ్ళాక, అప్పటివరకూ కొన్ని కథలూ, వ్యాసాలూ, మ్యూజింగ్సూ ఇలాంటివి రాసారు. 54 నుంచి 57 వరకూ  ఎక్కువగా ఏమీ రాయలేదు. 1957 లో ఏం జరిగిందంటే?

మద్రాస్ లో వుండే రచయిత నార్ల చిరంజీవి అని ఆయన ఒక వుత్తరం రాసారు. "మీరు గీతాంజలి"ని అనువదించరాదా?"అని. చలం గారు అప్పటివరకూ సూటి రచనలు తప్ప, అనువాదాలు చెయ్యలేదు. ఆ ఉత్తరానికి జవాబుగా ఏం రాశారంటే…  "నాకు అనువాదం చెయ్యడం ఇష్టమే. రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నా కూడా ఇష్టమే. కానీ, దాని 'కాపీ రైట్ ' లాంటివి. అలాంటి విషయాలు నాకు తెలీదు. "

దానికి నార్ల చిరంజీవి గారు "అవన్నీ నేను చూసుకుంటాను. మీరు అనువాదం ప్రారంభించండి " అన్నారు. అనడమే కాకుండా, ఆ తరువాత కొద్ది రోజులకి, నార్ల చిరంజీవి గారూ, మరికొందరు మిత్రులూ రమణాశ్రమానికి వెళ్ళి, చలం గారితో కూర్చొని ఆ ఠాగూర్ గీతాంజలి అనువాదం ప్రారంభం అయ్యేలా చూశారు. చలంగారు తన దగ్గరకు వచ్చిన మిత్రులకు చెప్పారు "నేను ఆ రచనలన్నీ మరచి పోదామనీ, గతాన్ని వదిలేద్దామనీ వచ్చాను. కానీ, చిరంజీవి గారు అడిగారు కాబట్టి, నేను ఈ 'గీతాంజలి' అనువాదం ప్రారంభిస్తున్నాను" అని.

గీతాంజలి అనువాదం చేసేటప్పుడు ఒక్కొక్క కవిత అయిపోగానే, సౌరీస్ గారికి చూపించి, ఆమె సలహాలు తీసుకొని, అక్షరం, అక్షరం  అతి జాగ్రత్తగా చూసుకుంటూ దానికొక తుది రూపాన్ని ఇచ్చారు కొద్దీ నెలల్లోనే. ఆ గీతాంజలి అనువాదం చేసేటప్పుడు ఆయనకు ఎదురైన అనుభవాల గురించి, భావాల గురించి మిత్రుడు జరుక్ శాస్త్రికి ఒక వుత్తరం రాసారు. ఆ వుత్తరంలో ఇలా చెప్పారు.

"గీతాంజలి తర్జుమాలో నా చిక్కుల్ని మీరు గ్రహించినట్లు లేదు. నన్ను, నాకు వదిలేస్తే, ఇంగ్లీష్, తురకం, తెలుగుని వంకర్లు తిప్పి ఎట్లాగో మీకు అర్థం చేయగలను. కానీ, సౌరీస్ దానికి ఒప్పుకోరు. భాషలో కూడా 'గీతాంజలి' గౌరవాన్ని నిలపాలి. అందువల్ల, సరైన పదాల్ని, సంపాదించాల్సిన, అంకుశం కిందికి రావాల్సి వచ్చింది. " అని. ఆయన ఆ గీతాంజలి అనువాదం పూర్తి చేసాక, 1958 – 60 ప్రాంతాల్లో, దాన్ని నార్ల చిరంజీవి గారు చాలా అందంగా ముద్రించారు. దాని ముందుమాటలో చలం గారు ఇలా రాశారు.

"గీతాంజలి తమకు నచ్చదన్నా, తమకు అర్థం కాదన్నా నాకా మాట విపరీతంగా వినపడుతుంది. నా కాలేజీ దశ నుంచి, నన్ను కలవరపెట్టి ఇన్ ఫ్ల్యూయన్స్ చేసిన పుస్తకం ఈ గీతాంజలి. గీతాంజలి నాకు ఒక దృక్పథాన్నీ, ఫిలాసఫీ ఆఫ్ లైఫ్ నీ నేను అనుభవించే అందాలకు ఒక వెలుగునీ, నా ఆశలకు ఒక అర్థాన్నీ ఇచ్చింది. చిత్రం ఏమిటంటే, ఈశ్వరుడు లేని నా 30 ఏళ్ళ జీవితంలో కూడా ఈశ్వర లీలల్ని కీర్తించే గీతాంజలి, నా నిత్యపారాయణ గ్రంథంగా ఉండిపోయింది. నేనున్నాను అనే ఓదార్పు, వరదలై ముంచుతోంది. కానీ, ఆ వెల్లువలో ఒక్క తుంపర తనపై చిమ్మకుండా, నా హృదయం మూసుకుపోయింది. నా ఈశ్వరుడు చచ్చిపోయినాడు. బ్రతికి ఉంటేనా, ఈ గీతాంజలి అతనికి పాడుకుందును కదా! అని పరితపించాను. (బహుశా ఈశ్వరుడు చచ్చిపోయినాడు అనేటటువంటి మాట భగవాన్ రమణ మహర్షి గురించి రాసి వుంటారేమోనని అనుకుంటాను. అదే ముందుమాటకు చివరిగా ఇలా అంటారు. ) నా తర్కోష్ణతకు జంకి, దిక్కులేకుండా దాక్కున్న నా భక్తిభావన విహంగాలు ఇన్నేళ్ల తర్వాత కిలకిలమంటూ హృదయం పైన వాలి, చిరంజీవి గారి ప్రోద్బలాన ఈ గీతాంజలి ఆంధ్రీకరణలో నివాసాలు ఏర్పరుచుకున్నాయి."

ఆయన మనసులోనట 'భక్తి భావన' అనేటటువంటి పక్షులు వున్నాయి. కానీ, ఈయన తర్కం అనే వేటకి బయటకు రాకుండా, అంత కాలం లోపల ఉండిపోయాయి. గీతాంజలితో బయటకు వచ్చి, ఆయన హృదయం పైన వాలాయి. ఇట్లా ఆయన గీతాంజలి అనువాదాన్ని ఎంతగా అనుభవించారో చెప్పారు. ముఖ్యంగా ఈ కవితలన్నీ రవీంద్రనాథ్ ఠాగూర్ బెంగాలీ లో రాసినవి. తరువాత ఆయనే ఇంగ్లీష్ లోకి అనువాదం చేశారు. ఇవి అత్యంత కవితాత్మకంగా సాగుతాయి. అయితే ఇందులోని కవితలు ఎవరిగురించి రాశారు అంటే, అది అన్వయాన్ని బట్టి ఉంటుంది. చాలా మంది ఆయన భగవంతుడి గురించి రాసారంటారు. నిజంగా ఈ కవితలన్నీ చదివితే భక్తుడు, భగవంతుడి గురించి రాసినట్లుగా గానీ; ప్రేయసీ, ప్రియులు ఒకర్ని గురించి ఒకరు చెప్పినట్లుగా గానీ, ఒక మిత్రుడు, ఇంకో మిత్రుడి గురించి చెప్పినట్లుగానీ– ఇలా రకరకాల కోణాలతో అన్వయం చేసుకోవచ్చు. చాలావరకు ఇందులో ఉన్న కవితల్ని, చలంగారు కూడా ఒక్కొక్క కవితనీ, ఒక్కో విధంగా ఒక్కో కోణంలో అన్వయిస్తూ అనువాదం చేశారు. మచ్చుకి ఒకటి, రెండు చూద్దాం...

*“అంతం అనేది లేకుండా చేశావు నన్ను, నీ ఆనందం అది.*
*నాజూకైన జీవన పాత్రని తిరిగి, తిరిగి రిక్తం*
*వెంటవెంటనే నవజీవనంతో నింపుతూ ఉంటావు.*
*ఈ చిన్న రెల్లు పిల్లంగోవిని*
*నీ వెంట కొండ కోనల్లో తిప్పుకొని, నిరంతరం నూతన రాగాల్ని పలికిస్తావు.*
*నీ అమృత హస్త స్పర్శ వల్ల ఉల్లాసంతో నా గుండె,*
*పరిధుల్ని దాటి, అనిర్వాఙ్యమైన భావాల్ని పలుకుతుంది.*
*అంతులేని నీ కాన్కల్ని ఈ చిన్న దోసిలిలోకి తీసుకుంటాను.*
*యుగయుగాలు గడచినా, ఇంకా నువ్వు వర్షిస్తూనే ఉంటావు.*
*ఇంకా నా దోసిలిలో స్థలం మిగులుతూనే ఉంటుంది “*

ఈ కవితల మూలంలో రవీంద్రనాథ్ ఠాగూర్ గారి గొప్పతనం యెంత వుందో, చలంగారు వాటిల్లోని ఆత్మ ఏమాత్రం తగ్గకుండా అనువదించారు. తెలుగులో చదివినా గానీ, ఆ భావావేశం, తీవ్రత మనకు కనిపిస్తూవుంటుంది. చలంగారు అనువాదం చేసిన మరొక కవిత.

*“మంత్రాలూ, కీర్తనలూ, పాలూ విడిచిపెట్టి, తలుపులన్నీ బంధించి,*
*ఈ గుడి చీకటి మూల ఒంటరిగా ఎవరిని పూజిస్తున్నావు?*
*కళ్ళు తెరచి చూడు. నీ ఎదుట నీ ఈశ్వరుడు లేడు.*
*ఎక్కడైతే గట్టి నేలని రైతు దున్నుతున్నాడో,*
*ఎక్కడ బాట వెయ్యడానికి కూలీలు రాళ్లు కొడుతున్నారో,*
*అక్కడ ఈశ్వరుడు ఎండలో, వానలో*
*దుమ్ముకొట్టిన బట్టలతో వాళ్ళ మధ్య తిరుగుతున్నాడు.*
*నీ మడి బట్టలు అవతలపెట్టి, నువ్వు నేలమీదకి రా!*
*మోక్షమా?ఆ మోక్షమనేది ఎక్కడ ఉందయ్యా?*
*మన ప్రభువే సంతోషంగా ఈ సృష్టి బంధనాన్ని వేసుకున్నాడు.*
*శాశ్వతంగా మనతో తను కట్టుబడి వున్నాడు.*
*నీ పుష్పాలూ, ధూపాలూ దూరాన పెట్టి,*
*నీ ధ్యానంలో నుండి బయటకు రా!*

*నీ బట్టలు చిరిగి మరకలైతే, వచ్చిన ముప్పేమిటి?*
*నుదిటి చెమటతో కష్టించి, కృషిలో అతని పక్కన నిలబడు."*

ఈ గీతాంజలిని తెలుగులో దాదాపు 50 మంది అనువాదం చేశారు. "అన్ని అనువాదాల్లోకి ఉత్కృష్టమైనది చలం గారి అనువాదం" అని విశ్లేషకులు ఈ రోజుకి కూడా అభిప్రాయపడుతూ వుంటారు. అలాగే ఠాగూర్ గారి గీతాంజలి లో అందరికీ తెలిసిన కవిత "వేర్ ది మైండ్ ఈజ్ వితవుట్ ఫియర్ " దాన్ని చలంగారి ఎలా అనువాదం చేశారంటే...

ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో,
ఎక్కడ మనుషులు తలెత్తి తిరుగుతారో,
ఎక్కడ జ్ఞానం విరివిగా వెలుస్తుందో,
సంసారపు గోడల మధ్య భాగాల కింద
ఎక్కడ ప్రపంచం విడిపోలేదో,
ఎక్కడ సత్యాంతరాళం లోంచి పలుకులు బయలు వెళతాయో,
ఎక్కడ అలసట నెరగని శ్రమ తన బాహువుల్ని పరిపూర్ణత కోసం చాస్తుందో
ఎక్కడ నిర్జీవమైన ఆచారపు టెడారిలో
స్వచ్ఛమైన బుద్ధి ప్రవాహం ఇంకిపోకుండా ఉంటుందో,
ఎక్కడ నిరంతరం, భావాలలో, కార్యాలోకీ, నీచే నడపబడుతుందో
ఆ స్వేచ్ఛా స్వర్గానికి నాదేశాన్ని మేలుకొలుపు."

గీతాంజలి తరవాత చలంగారు రవీంద్ర నాథ్ టగోర్ రాసిన మరికొన్ని కవితా పుస్తకాల్ని కూడా ఆయన తెలుగులోకి అనువాదం చేశారు. "ఫలసేకరణ " అలాంటివి.

ఇప్పుడు చలంగారు సరళమైన తెలుగులోకి అనువదించి, వాఖ్యానించిన క్రీస్తు సువార్తల గురించి తెలుసుకుందాం. చలంగారికి సౌరీస్ గారు చెప్పారు "క్రీస్తు సువార్తల'ని తెలుగులో రాస్తే బాగుంటుంద"ని. చలంగారికి గానీ, సౌరీస్ గారికి గానీ ఒక మతం, ఒక దేముడు అని కాదు. అందరి దేముళ్ళూ సమానమే, అన్ని మతాలూ సమానమే. అందుకనే ఈ బైబిలు అనువాదం క్రీస్తు సువార్తల అనువాదం అనేది అదేదో విభిన్నమైన కార్యక్రమం అనుకోకుండా, గీతాంజలి అనువాదం ఎలాగో, క్రీస్తు సువార్తల అనువాదం అలాగే ప్రారంభించారు.

అయితే, ప్రారంభించడానికి ముందు సౌరీస్ గారితో "ఈ గ్రంధాన్ని ఎంతో మంది గొప్ప మేధావులు అధ్యాయనం చేసి, అనువాదం చేశారు. నాకిది సఖ్యం అవుతుందో ,లేదో " అంటే, "కాదు. నువ్వు చేయగలవు నాన్నా !"అని, ప్రోత్సహించి, చలం గారితో, ఈ క్రీస్తు సువార్తల యొక్క అనువాదాన్ని, ప్రారంభింపజేశారు. అలాగే జీసస్ చెప్పినటువంటి ప్రతి వాక్యాన్ని తరచి, తరచి దానిలో వుండే అంతరార్ధాన్ని సౌరీస్ గారిని అడిగి మరీ అనువాదం చేశారు. అవసరం అయిన చోట్ల చక్కని వాఖ్యానం కూడా ఇచ్చారు. ఈ అనువాదాలు చేసిన రోజుల్లోనే మిత్రులకి రాసారు.

"ఒక్కొక్క సువార్తని తెలుగు చెయ్యడానికి మూడు నెలలు పడుతోంది. కాబట్టి, ఇది ఒక సంవత్సరం పని. ఇప్పుడు "లోకా సువార్త"లో సగం అయ్యింది. యేసు శుభవార్తలు చదివితే, హిందువులు తమకే తెలుసని విర్రవీగే గురు న్యాయం మొదలైన ఆధ్యాత్మిక సాధన విషయాలు చాలా విపులంగా కనపడతాయి. గీతాంజలి విషయంలో గానీ, యేసు సువార్తల విషయంలో గానీ, గమనించాల్సిన విషయం ఏమిటంటే మామూలుగా అర్థం అయ్యేటట్లు చెయ్యడం కాదు. మనసుకి అర్థం అయ్యేటట్లు, మనసు వెనకాల మీ ఆత్మకి అర్ధం అయ్యేటట్లు చెప్పడం."

గొప్ప క్రైస్తవ పండితులకి కూడా తెలియని విషయాలు చలంగారి అనువాదంలో విశదమవుతాయి. మళ్ళీ ముక్కకి, ముక్కా అనువాదం చెడదు. గీతాంజలిలో కూడా అదే జరిగింది. అందువల్లే చలంగారి అనువాదాన్ని క్రిష్టియన్లు ఇష్టపడలేదట. ఎందుకంటే, దాంట్లో హిందూపరమైన వేదాంత పరమైన అర్థం కనపడింది వాళ్లకి. కానీ, చలంగారు ఏమంటారంటే,

"అది హిందూ కాదు. క్రిష్టియను కాదు. నేను అనువాదం చేసింది. అసలైనటువంటి సత్యం "

ఆయన నాలుగు సువార్తలని అనువాదం చేస్తున్నారని తెలిసి, ఒక క్రిష్టియన్ సొసైటీ వాళ్ళు ముందుకు వచ్చారు. "ఈ నాలుగు సువార్తల్నీ అచ్చు వేస్తాము. కాకపోతే, మీరు మధ్య, మధ్యలో ' ఓం శాంతి, ఈశ్వరుడు ' అని రాసారు. తొలగిస్తే కనుక మేం అందంగా అచ్చువేయడమే కాకుండా, మీకు చాలా పారితోషికం కూడా ఇస్తాము "అన్నారు.

కానీ, దానికి చలంగారి ఒప్పుకోలేదు. ఎందుకంటే, ఆయన ఆ పుస్తకం రాసింది ధనార్జన కోసం కాదు. "జీసస్ అనే సత్యాన్ని లోకానికి తెలిపేందుకు రాసాను "అని చెప్పేరు. మతాన్నీ, సంకుచితత్వాన్నీ నిర్మూలించి ఒక సత్యాన్ని చాటేందుకు నేను అనువాదం చేస్తున్న మహాగ్రంథం ఇది. ఇలాంటి దాన్ని నేను మార్చను. మీరు దీనిని అచ్చువేయకపోయినా పర్వాలేదు. " అని వాళ్ళను తిరస్కరించారు. చలంగారి ఈ క్రీస్తు సువార్తలని అనువాదం చేసే సమయంలోనే ఆయన అభిమాని కె. సభాగారు "దేవదత్తం"అని ఒక పత్రిక నడుపుతున్నారు. ఆ పత్రికలో ఈ సువార్తలు చిన్నచిన్న భాగాలుగా వేశారు.

చలంగారు క్రీస్తు సువార్తలు అనువాదం చేసేటప్పుడే, మొట్టమొదట సారిగా ఒత్తిడి తట్టుకోలేక, ఆయనకు బ్లడ్ ప్రషర్ ప్రారంభమయింది. ఈ క్రీస్తు సువార్తల్ని, దాదాపుగా ఒక సంవత్సరం పాటు చలంగారు అనువాదం చేసాక, దాన్ని ముద్రించడానికి దాదాపుగా 6 నెలలు పట్టింది. ఆయన అభిమాని ఎన్. వీరేశలింగం గారికి చెప్పారు. ఆయన, చలం గారి అభిమానులందరికీ తెలియజేసి, “ఇది చక్కటి పుస్తకం అవుతుంది. దీన్ని ఎలాగైనా ముద్రించి తీరాలి” అని చెప్పి, ప్రచురణకు అవసరమైన నిధుల కోసమని, అందరికీ ఉత్తరాలు రాసారు.

అలా అభిమానులందరూ ఇచ్చిన విరాళాలతోటి, ఆ పుస్తక ప్రచురణ ప్రారంభమయ్యింది. ముద్రణ పూర్తి అయినా తరువాత 1966 క్రిస్మస్ సమయానికి ఆ పుస్తకాలూ రామణస్థాన్ కి వచ్చాయి. ఆపుస్తకాల్ని చూసుకొని చలం గారు అనుకున్నారట “అవును! ఇంత బాగా రాసాను ఇవన్నీ. చదివి ఎవరైనా మారతారా? చెదలు తిని, వాటికే మైనా జ్ఞానం వస్తుందా?”అని.

ఆ సువార్తలు చదివిన కొందరు “జీసస్ పైన ఇటువంటి అనువాదం చూడలేదు “అని చలంగారి ఉత్తరాలు రాసారు. ఇప్పుడు కూడా చలం గారి క్రీస్తు సువార్తలు చదివితే, ఏంటో సరళమైన తెలుగులో సాక్షాత్తూ జీసస్ క్రీస్తు మన ముందు నిలబడి మాట్లాడుతున్నట్లుగా ఉంటుంది. అది మూలంలో జీసస్ క్రీస్తు చెప్పినవాక్యాలు మహత్యం. చలంగారి అనువాదం శక్తి కూడా దాంట్లో కనిపిస్తూ వుంటుంది.

ఈ క్రీస్తు సువార్తల తర్వాత, ‘నిర్వికల్పం’ అనే గ్రంథం ఒకటి రాసారు. అది యేసు పైన వ్యాసావళి. అలాగే హిందూ, క్రైస్తవ మతాల్ని, సమన్వయించి, రెండూ ఒకటే అని చూపించే ఉద్గ్రంథం అన్నమాట. అందులో హిందూ, క్రైస్తవమతాల సారాంశాన్ని, పూర్తిగా సమీక్షించి, ఏకత్వాన్ని చాటి చెప్పారు.

ఒకసారి ఈ బైబిలుని అధ్యయనం చేయడం ప్రారంభించాక, దానిలో ఆయనకీ మహత్తరమైన కథలూ, విలువలూ కనిపించాయి. అందువల్ల చలంగారు, జీసస్ క్రీస్తు జీవితంలోని కొన్ని సంఘటనల్ని తీసుకొని, “మార్తా “అని ఒక నవల రాసారు. అది చాలా అద్భుతమైన పేరు తీసుకువచ్చింది. ఆ మార్తా నవల విడుదల అయ్యాక, కొంతమంది క్రైస్తవులు ”చలం గారూ! మీరు విఘ్నేశ్వరుడి మీదనో, రాముడి మీదనో రాసుకోరాదా? మా యేసు జోలికి ఎందుకు వచ్చారు? “అని తిట్టారట. కానీ ఒకసారి దాన్ని చదివిన తర్వాత.. “చలం గారూ! మార్తా లో మీరు రాసినట్లుగానే జీసస్ జీవితం నడిచింది“ అని అనడమే కాకుండా, ఆ నవలని క్రిస్టియన్ సొసైటీ లో ప్రచారం లోకి తీసుకురావడానికని, సినిమాగా తీస్తామని, దేశదేశాల్లో ప్రదర్శిస్తామని క్రైస్తవ సోదరులు చాలా మంది ముందుకు వచ్చారు. కానీ, జరగలేదు. అది విషయం అనుకోండి.

అప్పట్లోనే ‘రోజ్’ అని ఒక విదేశీయురాలు ‘మార్తా‘ నవల గురించి విని చలం గారితో అన్నారట “చలం ! దేరీజ్ ఏ మనీ ఇన్ యువర్ బుక్ ‘ అని. దానికి చలం గారు “దేరీజ్ ఎ బిగ్ మనీ ఇన్ మై మెనీ

బుక్స్, ఇఫ్ ఐ మేక్ స్మాల్ చేంజెస్ ఇన్ మై స్టోరీస్ టు ప్లీజ్ మై రీడర్స్ " అందువల్ల ఆయన ఏ రాజీ పడకుండానే ఆయన అనుకున్నది, అనుకున్నట్లుగానే అనువాదం చేసి, ఆ మార్తా నవల గానీ, ఆ నిర్వికల్పం పుస్తకం గానీ, ప్రజలకు అందించారు. మచ్చుకి ఈ సువార్తల్లో కొన్ని చూపిస్తాను.

మీకు తెలిసే ఉంటుంది. మత్తయి సువార్తల్లో 5,6,7 అధ్యాయాన్ని "సెర్మన్ ఆన్ ది మౌంటెన్ "అంటారు. డానీ చలం గారు "గిరి ప్రవచనం" అన్నారు. జీసస్ క్రీస్తు పర్వతం మీద కూర్చొని శిష్యులకి చెప్పిన మాటలు. క్రైస్తవ మతం యొక్క సారాంశం, క్రైస్తవ మతం యొక్క విలువలన్నీ కూడా ఈ 5,6,7 అధ్యాయాల్లో ఉన్నాయని అంటారు. అందులో నుండి కొన్ని వాక్యాలు.

"తన వెంట పడ్డ కుప్పల్ని చూసి యేసు మంచు కొండ పైకి వెళ్లి కూర్చున్నారు. తన శిష్యుల్ని చూసి వచ్చిన తర్వాత, వారికి ఇట్లా బోధించారు. "దుఃఖితులు ధన్యులు. వారికి ఓదార్పు దొరుకుతుంది. (కొన్ని సార్లు యధాతధంగా చదివితే, దాంట్లోని అర్థం ఇదేమిటి అని పించవచ్చు. అందుకని చలం గారు దానికి వాఖ్యానం ఇలా చెప్పారు.) దీన్ని బోధించినది శిష్యులకు. కాకపోతే, దీనిలో కొన్ని భాగాలు తప్ప, తక్కిన దంతా కూడా ప్రజలందరి నడవడికకు, ప్రమాణంగా వర్తిస్తుంది. ఈ బోధనలను లిటరల్ గా తీసుకోవడం అబ్సర్డ్. అందువల్ల దీన్ని ఆచరణ యోగ్యంగా తీసుకోవడం మూర్ఖం. ఈ బోధనల లోని అసలు సత్యాన్ని తీసుకొని, ఎవరికి చేతనైనంత వరకూ వారు ఆచరణలో పెట్టడానికి ప్రయత్నించాలి.

దుఃఖితులకు ఓదార్పు దొరుకుతుంది. అనే వాక్యానికి అర్థం ఏమిటంటే...

'దుఃఖితులు' అంటే అన్యాయం వల్ల గానీ, పరిస్థితుల వల్ల గానీ దుఃఖితులైన వారు. "ఓదార్పు పొందుతారు' అంటే, దుఃఖం పోవడమే కాదు. వారికి ఈశ్వరుడు నుండి ఓదార్పు వస్తుంది. అందువల్లనే వాళ్ళు ధన్యులు అని. ఇలా మధ్య మధ్యలో "ఈశ్వరుడు, శాంతి "ఇలాంటి మాటలు వాడడం అనేది, కొంత మంది ఆనాటి క్రైస్తవ సోదరులకు నచ్చలేదు అంటారు. అలాగే ఆయన చేసిన సరళమైన అనువాదాలు కూడా.

"నేను చెబుతున్నాను. వినండి. కారణం లేకుండా సోదరుడిపై ఆగ్రహించిన వాడికి శిక్ష జరుగుతుంది. ఎవరు తన సోదరుడ్ని అప్రయోజకుడంటాడో, అతను పంచాయితీ ముందు నిలవాల్సి ఉంటుంది. 'సోదరుడ్ని మూర్ఖుడా! ' అని తిట్టినవాడు నరకాగ్ని లో పడిపోతాడు. ఆనక నువ్వు ఆలయానికి నైవేద్యం తెచ్చినప్పుడు నీ సోదరుడి మనస్సులో నీపై కినుక ఉందని, జ్ఞాపకం వస్తే,పూజ పీఠం ముందు నీ నైవేద్యాన్ని వదలి తిరిగి వెళ్ళు. సోదరుడితో సంధి చేసుకొని, తరువాత వచ్చి నీ నైవేద్యాన్ని సమర్పించు.

5 వ అధ్యాయనం 43 వ వచనంలో "నీ మీరతడ్ని ప్రేమించి, శత్రువుని ద్వేషించమని చెప్పగా విన్నాను. నేను చెబుతున్నాను. నీ శత్రువుల్ని ప్రేమించు. నిన్ను శపించేవారికి దీవించు. నిన్ను అసహ్యించుకొని లోకువ చేసి, బాధించేవారి కోసం ప్రార్ధించు.

6వ అధ్యాయంలో "మీరు దానం చేసేటప్పుడు మీ కుడి చెయ్యి ఏమి చేస్తుందో, ఎడమచెయ్యికి తెలియనివ్వకండి. మీరు దానం చేస్తున్నట్లు ఎవరికీ తెలియకూడదు. ఎవరికీ తెలియకుండా, అన్నీ గమనించే తండ్రి, మీకు బహిరంగంగా బహుకరిస్తారు. "

ఇంత సరళమైన తెలుగులో క్రీస్తు సువార్తలని అందించారు చలం గారు.

ఇవండీ గీతాంజలీ, సువార్తలూ చలం గారు చేసినటువంటి భిన్న సాహిత్య ప్రక్రియలకు ఉదాహరణలు.

చలంగారి సాహిత్యాన్నంతటిని సమీక్షించుకోవడం సంగతి పక్కన ఉంచి, పరిచయం చేసుకోవాలంటేనే మరొక 25 భాగాలు మనకు కావాలి. ఇక చలం గారి నాటకాలూ, నాటికలూ, వ్యాసాల గురించి మాట్లాడుకోనే లేదు. ఏ కథనికైనా ఒక ముగింపు ఉండాలి కదా! "చలం సాహిత్యం– జీవితం" కథనానికి ఇది ముగింపు. లోగడ చాలా సార్లు చెప్పినట్లుగానే, చలం గారి సాహిత్యమూ, జీవితమూ కూడా అత్యంత విస్తృత మైనవి. చలం గారి సాహిత్యంలో ఏ ఒకటో, రెండో పుస్తకాలు చదివి ఒక అభిప్రాయానికి రాకూడదు, ఆయన జీవితంలోని ఒకటి, రెండు సంఘటనలను తెలుసుకుని "చలం అంటే ఇంతే" అనే అంచనాకు రాకూడదు.

ఈ కథనాన్ని చదివిన పాఠకులు ఈ విషయాన్ని గమనించే వుంటారు. శతాబ్దాల తెలుగు సాహిత్యంలో చలంగారి జీవితమంత తెరచిన పుస్తకం మరే రచయితకూ, మరే రచయత విషయం లోనూ కనిపించదు.

ఒకటి కాదు, రెండు కాదు ఆయన జీవితంలో వందలకొద్దీ మలుపులు వున్నాయి. ఎన్నో ఆనందాలూ, విషాదాలూ, ఎన్నో ఉద్విగ్నతలూ, ఎన్నో సంక్లిష్టతలూ, ఎన్నో పోరాటాలూ, ఎన్నో అవమానాలూ, ఎన్నో సంఘర్షణలు. చలం గారి జీవితాన్నీ, సాహిత్యాన్నీ మహాసాగరంలో పోల్చడంతో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

"చలం సాహిత్యం– జీవితం" 22 భాగాల కథనాన్ని ముగించబోయే ముందు చిట్టా చివరిగా ఒక్క మాట.

తెలుగు సాహిత్యంలో చలంగారి యొక్క స్థానం ఎవరూ భర్తీ చేయలేనిది. తెలుగు సాహిత్యంలో రచయితగా చలంగారు ... చిరంజీవి…చిరంజీవి ....చిరంజీవి .... !!

(అయిపోయింది )

ధన్యవాదాలు

మహా సాగరం, ఆకాశ సదృశం, నింగిని తాకే గిరి శిఖరం… చలం –గుడిపాటి వెంకట చలం. వీరిని గురించిన ఈ 22 భాగాల కథనం ఇది ఒక అద్భుతమైన ప్రయాణంలాగ అనిపించింది. ఈ పరిమిత సమయంలో సమయంలో నాకు సాధ్యమైనంతలో వీలయినంత వివరం గానూ, వీలయినంత ఖచ్చితత్వంతో మీకు అందించే ప్రయత్నం చేసాను. ఎక్కడైనా చిన్నచిన్న పొరపాట్లు దొర్లి ఉంటే, నాదృష్టికి తీసుకువస్తే, ఇది పుస్తకరూపంలో వచ్చేటప్పుడు సవరణలు చేస్తాను. ఈ కథన రూపకల్పనలో, ఈ సుదీర్ఘ ప్రయాణంలో చలంగారితో పరిచయం వున్నటువంటి వ్యక్తులూ, వారి అభిమానులూ, ఆయన కుటుంబ సభ్యులూ ఎంతో మంది సహాయం అందించారు. ఎప్పుడు ఎవరికి ఫోన్ చేసినా సానుకూల స్పందన రావడం, ఆశించిన సమాచారం అందుకోవడం, అది నా అదృష్టంగా భావిస్తున్నాను. వీళ్ళలో కొంత మంది గురించి లోగడ కార్యక్రమాల్లో చెప్పాను. మరొక్కసారి అందరినీ గుర్తు చేసుకోవడం నా విద్యుక్త ధర్మంగా భావిస్తూ మీతో పంచుకోవాలనుకుంటున్నాను.

చలం గారి గురించి ప్రత్యేక కార్యక్రమం చెయ్యమని అభిమానులు చాలా రోజులుగా అడుగుతున్నారు. అయితే, చలం గారి గురించి కార్యక్రమం చెయ్యడం అంటే, ఇతర రచయితల గురించి కార్యక్రమం చేసినంత తేలిక కాదని తెలుసు. అందుకే చాలా కాలంగా వాయిదా వేస్తూ వచ్చాను. చిట్టచివరికి ఈ కార్యక్రమం ఎలాగైనా ప్రారంభించాలని అనుకున్నప్పుడు చలంగారి పుస్తకాలూ 5,6 మాత్రమే నా దగ్గర వున్నాయి. ఈ కార్యక్రమం ప్రారంభించాలంటే, చలంగారి జీవితంతో ప్రారంభిద్దామంటే, ఆయన ఆత్మకథ అర్థం చేసుకోవడానికి కావలిసిన డీ కోడ్స్ దొరకలేదు. అందువల్ల అప్పటికి నాకు అందుబాటులో వున్న సాహిత్యంతో ముందు ప్రారంభించాను. ఒకటి, రెండు భాగాలూ జరుగుతుండగా చలంగారి జీవితం గురించిన వివరణలూ, స్పష్టతల కోసం అన్వేషణ ప్రారంభించాను.

మిత్రులూ, సినీ దర్శకులూ వంశీ గారు తానూ మద్రాస్ వెళ్లిన కొత్తలో, చలం గారి అల్లుడు వజీర్ రహ్మాన్ గారితో సన్నిహితంగా ఉండేవారని ఎప్పుడో చెప్పిన విషయం గుర్తుకు వచ్చి, ఆయనకు ఫోన్ చేసి, ఆయన దగ్గర నుండి కొంత సమాచారం తీసుకున్నాను.

ఆ తరవాత 6,7 ఏళ్ళ క్రిందట సాక్షి దినపత్రికలో "యామిజాల జగదీశ్" అనే ఆయన చలం గారి గురించి, వారితో తన చిన్నతనంలో తనకున్న పరిచయం గురించి వ్రాసిన వ్యాసం నా ఆర్కైవ్స్ లో కనిపించింది. ఈ 'యామిజాల జగదీశ్' గారు ఎవరు? అని ఆలోచించినపుడు, ఆయన గతంలో కౌముదికి కొన్ని రచనలు పంపించారు. అందుకని అవి వెతికి, ఆయన ఈ– మెయిల్ పట్టుకొని, "మీ ఫోన్ నంబర్ ఇవ్వండి మీతో మాట్లాడాలి " అని అడిగాను. ఆయన వెంటనే స్పందించారు. ఆయనకు ఫోన్ చేసి ఆయనతో మాట్లాడాను. ఆయన చలం గారికి

అత్యంత ఆత్మీయులైన “యామిజాల పద్మనాభ స్వామి “గారి అబ్బాయి. ఆయన చిన్నప్పుడు చలం గారి ఆశ్రమంలో వున్నారు. ఆయన కొన్ని విషయాలు చెప్పారు.

ఆయనే ఇంకో విషయం చెప్పారు “వరంగల్ లో ఉన్న అంపశయ్య నవీన్ గారు ఇటీవల చలంగారి జీవితాన్ని ఒక నవల రాసారు. ఆయన్ని అడిగితే , మీకు ఎక్కువ సమాచారం దొరకవచ్చు. “ అని. నవీన్ గారి నంబర్ ఆయన దగ్గర లేదు. నవీన్ గారి కోసమని ఆయన పాత పుస్తకాలు తిరగేస్తే, అందులో లేండ్ ఫోన్ నంబర్ వుంది. దానికి చేస్తే అది డిస్కనెక్ట్ అని వచ్చింది. అప్పుడు గుర్తుకు వచ్చారు– గొర్తి బ్రహ్మానందం అనే సిలికాన్ మిత్రుడు. ఆయన రాసిన నవలకు నవీన్ గారు పురస్కారం అందించారు. బ్రహ్మానందం గారికి “మీ దగ్గర నవీన్ గారి ఫోన్ నంబర్ వుందా?” అని మెసేజ్ పెట్టాను. ఆయన వెంటనే సమాధానం ఇచ్చారు.

ఆ సమాధానంతో, నవీన్ గారికి ఫోన్ చేసాను. ఆయనకీ, నాకూ ముఖపరిచయం కూడా లేనప్పటికీ నేను ఆయనకు తెలుసు. ఆయన అందరికీ తెలుసనుకోండి. ఆయన కొన్ని విషయాలు చెప్పారు. ఆయన నవల రాయడంలో కొన్ని పరిశోధనలూ, అలాగే ఆయనకు తెలిసిన మరికొన్ని విషయాలు. అంతే కాకుండా మరొక వ్యక్తిని పరిచయం చేశారు.

ఆయన పేరు డా:వావిలాల సుబ్బారావు గారు. అమరావతిలో వుంటారు. ‘చలం ఫౌండేషన్’ లో చాలా కీలకమైన పాత్ర వహిస్తున్నారు. ఆయనకు ఫోన్ చేసి, ఆయనతో మాట్లాడాను. ఆయన ద్వారా విశాఖపట్నం లో వుండే, నాగళ్ళ గురు ప్రసాదరావు గారూ, ఆయన ద్వారా ఉదయ్ కుమార్ గారి తోటి మాట్లాడాను.

ఆ తరువాత చలంగారి సమగ్ర సాహిత్యం అనే పుస్తకంలోని కొన్ని వివరాల ద్వారా భీమునిపట్నం లో వుండే “స్నేహ కుటీర్ “లో వుండే, ‘రాజా రాంబాబు’ గారు మరికొన్ని విశేషాలు చెప్పారు. ఆయన ద్వారా తెలిసినదేమిటంటే, చలం గారి రెండో అమ్మాయి నిర్మల గారు కోయంబత్తూర్ లోని ‘చిన్మయా ఆశ్రమం’లో వున్నారని. ఇంటర్ నెట్ లో ఆ చిన్మయా మిషన్ కి ఫోన్ చేసాను. అక్కడివాళ్లు “నిర్మలా చలం మాదగ్గరే వున్నారు. కాకపోతే, బయటవాళ్ళతో మాట్లాడేటటువంటి పరిస్థితిలో లేరు. దగ్గరగా ఉండి, కూర్చుంటే గనక ఆవిడకు కొంచెం గుర్తుకువస్తున్నాయి. అందువల్ల ఫోన్ లో మాట్లాడలేరు “అని చెప్పారు.

అప్పుడు ఆ నిర్మలగారికి వైద్యం చేస్తున్న డాక్టరు గారితో మాట్లాడాను. దురదృష్టవశాత్తూ, ఇది జరిగిన కొద్దీ వారాలకే నిర్మలగారు మరణించడం అనేది ఒక విషాద సంఘటన. ఇంతమందిని పరిచయం చేసుకుంటూ వెళుతున్నప్పుడు డిగ్రీలో నాకు సహాధ్యాయిగా, ప్రస్తుతం తిరపతిలో ఉంటున్న సుబ్బనాచారి గుర్తుకు వచ్చారు. ఆయన 1990 నుండి ఇప్పటివరకూ క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం భీమిలిలో వున్న స్నేహ కుటీర్ కు వెళుతుంటారు. ఆయన ద్వారా కొన్ని విషయాలు తెలుసుకున్నాను.

ఇదంతా జరుగుతుండగా ఈ కార్యక్రమం 5,6 భాగాలు గడిచాయి. ఆ సమయంలో విశాఖపట్నం లో ఉండే నా టాక్ షో లకు అభిమాని దేవభక్తుని జవహర్ లాల్ ఫేస్ బుక్ లో ఒక మెసేజ్ పెట్టారు. అందులో "స్నేహ కుటీర్ ట్రస్ట్" చైర్మన్ పాలడుగు రాజశేఖర్, వారి శ్రీమతి లక్ష్మి కాంటాక్ట్ నంబర్లు ఇచ్చారు. అప్పుడు రాజశేఖర్ గారికి ఫోన్ చేసి, మాట్లాడాను.

ఆయన చలంగారితో వ్యక్తిగత పరిచయం ఉన్న హనుమంతరెడ్డి గారి నంబరూ, అలాగే చలం గారి ఆశ్రమంలో పెరిగి పెద్దవాడైన 'తంబి' గారి నంబర్ ఇచ్చారు. వాళ్ళిద్దరితో కూడా మాట్లాడాను. ఈలోగా ఫేస్ బుక్ లోనే "చంద్ర రెంట చింతల"అనే మిత్రుడు "డా:భార్గవి అనే ఆమె చలం గారి గురించి రాస్తున్నారు. వీలయితే ఆమెతో మాట్లాడండి." అని చెప్పారు.

డా:భార్గవిగారి గురించి వెతికితే, ఆమె నా ఫ్రెండ్ లిస్ట్ లో వున్నారు. ఆమెకు మెసేజ్ పెట్టాను. వెంటనే ఆవిడ నాకు ఫోన్ నంబర్ ఇవ్వడం, నేను మాట్లాడడం జరిగాయి. డా:భార్గవి గారు నర్తకి గారి గురించి చాలా సమాచారం ఇవ్వడమే కాకుండా, చలం గారి మనవరాలు "కిట్టు " గారి ఫోన్ నంబర్ ఇచ్చారు. వెంటనే కిట్టు గారితో మాట్లాడాను. అప్పటినుండి ప్రతి వారం కిట్టూ గారితో మాట్లాడుతూ, అరుణాచలజీవితంలోని అనేక విషయాలలో స్పష్టత తెచ్చుకోవడం జరిగింది. డా: భార్గవి గారి ద్వారానే కొడవటిగంటి కుటుంబరావు గారి అల్లుడు గణేశ్వరావు గారు పరిచయమైతే, ఆయనతో కూడా మాట్లాడాను. ఆయన కొన్ని వివరాలు ఇచ్చారు.

ఇది ఇలా ఉండగా నేను ఎప్పుడూ తిరువణ్ణామలై వెళ్ళలేదు. కానీ, చలం గారి ఆశ్రమం గురించి చెప్పేటప్పుడు,ఆ పరిసరాలు ఎలా ఉండేవి? ఇప్పుడు ఎలా వున్నాయి?ఈ విశేషాలు తెలుసుకోవాలనిపించింది. అది ఇంటర్ నెట్ లో వెతకడం కన్నా, అక్కడ స్థానికంగా వున్నవాళ్లు ఎవరైనా చెబితే బాగుంటుందని భావించి, రమణాశ్రమం దగ్గర ప్రస్తుతం నివసిస్తున్న పోదూరి వెంకట శర్మ గారి వివరాలు తెలుసుకొని, ఫోన్ చేసి, ఇప్పుడు అరుణాచలం ఎలా ఉందీ.. అనే వివరాలు సేకరించాను.

చలంగారి స్నేహితురాలు లీలగారు వాళ్ళ అబ్బాయికి పిఠాపురంలో ఒక ఆసుపత్రి ఉండేదని ఎక్కడో చదివాను. ఆత్మీయమిత్రులు, రాజమండ్రిలో ఉండే సత్యన్నారాయణ గారిని సంప్రదించి, ఇప్పటికి కూడా ఉన్నటువంటి " వెంకటాచలం క్లినిక్ " ఆ ఫోటో ఒకటి సంపాదించాను. ఈ కార్యక్రమం ఇంత ఖచ్చితత్వంతో రావడానికి ఇంత మంది సహకారం తెరవెనుక వుంది. వీళ్ళలో చాలా మందితో ఒకటి, రెండు సార్లు కంటే ఎక్కువగా మాట్లాడాను. ఎప్పుడు ఫోన్ చేసినా గానీ, కాదనకుండా నాకు తగిన సహకారం అందించారు. ఇదంతా ఒక ఎత్తు అయితే, ఈ కథనం టాక్ షో గా వస్తున్న 22 వారాలూ అందరూ విని, స్పందించి, అందించినటువంటి ప్రోత్సాహం

మరొక ఎత్తు. వాళ్లందరికీ నా హృదయపూర్వక అభినందనలూ, కృతజ్ఞతలూ తెలియజేస్తూ ఇంతటితో ఈ కథనాన్ని ముగిస్తున్నాను.

★★★★★★★★★★★

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 జూన్ 25 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

.

COMMENTS